


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 12.05.2026 | సంపుటి: 3 | సంచిక: 100 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 12.05.2026 | VOLUME : 3 | ISSUE : 100 | PAGES: 8 | COST: 2/- |

## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



## చెరువుల పరిరక్షణకు 900 సీసీటీవీలు

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- ఆక్రమణలు, మట్టి పోయడంపై కఠిన నిఘా
- ఐసీసీసీతో అనుసంధానమైన నిఘా వ్యవస్థ

02

## కులానికో రెసిడెన్షియల్ పాఠశాల



- వీటితో సమాజాంలో పెరుగుతున్న కులవివక్ష
- కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నా
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, మే 11(రాజముద్ర న్యూస్):** ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా

మిగతా 2వ పేజీలో..



02

బండి భగీరథ్ కేసుపై
## సీఎం సీరియస్..

- తక్షణమే విచారణకు ఆదేశం



02

## సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయి వైద్య సేవల కేంద్రంగా తీర్చిదిద్దాలి

- ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు

# మోదీ పిలుపు..
# దేశవ్యాప్త చర్చ!

- బంగారం కొనొద్దన్న పిలుపు వెనుక భారీ స్కెచ్..
- రూపాయి విలువ పతనాన్ని అడ్డుకునేందుకేనా?

విదేశీ మారక ద్రవ్యం కరిగిపోతుందన్న ఆందోళనే కారణమా?

అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ముందరి కాళ్లకు బంధం వేసే వ్యూహం

చమురు భారం నుంచి దేశాన్ని గట్టెక్కించే మార్గం..

ఇంధన పొదుపుతోనే ఆర్థిక వ్యవస్థకు ఊపిరి!

మళ్ళీ వర్క్ ఫ్రమ్ హోమ్ చర్చ ఎందుకు?

పెట్రో సంక్షోభం ముంచుకొస్తున్న తరుణంలో ముందస్తు హెచ్చరికా?

ధరల నియంత్రణకు వినూత్న సూత్రం..

ఇది కేవలం సలహా మాత్రమేనా?

ముంచుకొస్తున్న ఆర్థిక సంక్షోభానికి ముందస్తు సంకేతమా?

**తెలంగాణ బ్యూరో, మే11 (రాజముద్ర న్యూస్):** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరమైన ఆర్థిక పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తదనంతర పరిణామాలు మరియు పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు అత్యంత కీలకమైన సందేశాన్ని ఇచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో ప్రభుత్వం కంటే ప్రజల బాధ్యతే అధికమని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ హఠాత్తుగా దేశ ప్రజలకు చేసిన ఈ విజ్ఞప్తుల వెనుక కేవలం సలహాలు మాత్రమే లేవని, ముంచుకొస్తున్న అంతర్జాతీయ ఆర్థిక గండాల నుంచి దేశాన్ని రక్షించే ఒక పటిష్టమైన 'ముందస్తు రక్షణ వ్యూహం' దాగి ఉందని రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ

మిగతా 2వ పేజీలో..





## రేవంత్ పాలనలో గుడుల విధ్వంసం

- మాజీ మంత్రి హరీశ్ రావు
- 800 ఏళ్ల కాకతీయ శివాలయం ఉద్దేశపూర్వకంగానే కూల్చివేత
- గుప్త నిధుల కోసమే అర్ధరాత్రి తవ్వకాలు
- పురావస్తు శాఖ ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేయాలి

**వరంగల్, మే11 (రాజముద్ర న్యూస్) :** "రేవంత్ రెడ్డి పాలనలో బడులు ఆగడమే కాదు, గుడుల విధ్వంసం కూడా జరుగుతోంది" అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామంలో ధ్వంసానికి గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 800 ఏళ్ల కాకతీయుల నాటి శివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు.
ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు,

మిగతా 2వ పేజీలో..



## కార్మికులకు గౌరవప్రద జీవనం కల్పిస్తాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష
- జీవన వ్యయానికి అనుగుణంగా కొత్త వేతన విధానంపై చర్చ

**హైదరాబాద్, మే11 (రాజముద్ర న్యూస్) :** "కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో కనీస వేతనాల సవరణపై సోమవారం

మిగతా 3వ పేజీలో..

## ఖరీఫ్‌కు యూరియా కొరత రాకుండా చర్యలు

- మే చివరి నాటికి 3 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ సిద్ధం చేయాలి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మే 11 (రాజముద్ర న్యూస్):** రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు మరియు నానో యూరియా వినియోగంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మిగతా 3వ పేజీలో..






## బీజేపీ సభలో ప్రధాని వ్యాఖ్యలు సరికాదు

- ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం తగదు
- మంత్రి పొన్నం ప్రభాకర్
- తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో చెప్పాలి
- కాళేశ్వరం అంశంలో బీజేపీపై విమర్శలు
- బండి సంజయ్ కుమారుడి కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలి

**హైదరాబాద్, మే11 (రాజముద్ర న్యూస్) :** బీజేపీ సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా మాట్లాడడం తగదన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రధాని రాష్ట్రానికి వచ్చి భరోసా ఇవ్వాల్సింది పోయి "పెట్రోల్, డీజిల్ వాడొద్దు, బంగారం

మిగతా 3వ పేజీలో..



## దేశ నైపుణ్య రాజధానిగా తెలంగాణ

- యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం : మంత్రి శ్రీధర్ బాబు
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో
- భారీగా పాల్గొన్న ఉద్యోగార్థులు

03

## మనుషులకు వీధి కుక్కల రక్తం?!

- హైదరాబాద్ కేంద్రంగా 'బ్లడ్ మాఫియా' అరాచకం
- రాయదుర్గంలో 'పెట్స్ కేర్' ఆస్పత్రి దారుణాలు బట్టబయలు
- మేకలు, గొర్రెల రక్తం నుంచి ప్లేట్‌లెట్ల సేకరణ
- ప్లాస్మాను రూ. 700 కొని రూ. 3,800 విక్రయిస్తున్న కేటుగాళ్లు
- జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ ఎంట్రీ
- ఈమెయిల్ ఫిర్యాదుతో కదిలిన సర్కారు యంత్రాంగం!



03

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి
## రావడం ఖాయం

- ప్రధాని సభ విజయంతో కేడర్‌లో ఉత్సాహం: ఎంపీ ఈటల

03





## చెరువుల పరిరక్షణకు 900 సీసీటీవీలు

**హైదరాబాద్:**
నగరంలోని చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా భారీ స్థాయిలో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. చెరువులను మట్టితో నింపడం, ఆక్రమణలు, నిర్మాణ వ్యర్థాలు వేయడం వంటి అక్రమాలను అరికట్టేందుకు 900 సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సోమవారం ఈ ఆధునిక నిఘా వ్యవస్థను ఆయన ప్రారంభించారు.
చెరువుల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమేరాలను నేరుగా హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానం చేశారు. దీంతో చెరువుల వద్ద జరిగే ప్రతి కదలికను కంట్రోల్ రూమ్ నుంచే నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. ఎవరైనా మట్టి పోయడం, ఆక్రమణలకు ప్రయత్నించడం, వ్యర్థాలు వేయడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేశారు.
ఇప్పటికే చెరువుల వద్ద లేక్ ప్రొటెక్షన్ బృందాలు పనిచేస్తుండగా, ఇప్పుడు సీసీటీవీ నిఘా అందుబాటులోకి రావడంతో పర్యవేక్షణ మరింత పటిష్టమైందని అధికారులు తెలిపారు. మట్టి తీసుకువచ్చే వాహనాల వివరాలను కూడా కెమేరాల ద్వారా గుర్తించి అక్కడి బృందాలను అప్రమత్తం చేస్తామని పేర్కొన్నారు. ఈ నిఘా వ్యవస్థను బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. చెరువుల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కమిషనర్ రంగనాథ్ పిలుపునిచ్చారు.

## బండి భగీరథ్ కేసుపై సీఎం సీరియస్..

**హైదరాబాద్, మే 11:**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపైన తక్షణమే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం ఆదేశించారు. మే 8న ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను సీఎంకు డీజీపీ వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలియజేశారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆనంద్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.
బండి భగీరథ్‌పై ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఫిర్యాదు వచ్చింది. తనను భగీరథ్ వేధిస్తున్నారని, పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఓ మైనర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు భగీరథ్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఈ అంశం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి కుమారుడిని ప్రభుత్వమే కాపాడుతోందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది..

### సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయి
## వైద్య సేవల కేంద్రంగా తీర్చిదిద్దాలి

- **ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు**

**హైదరాబాద్, మే 11:**
సనత్‌నగర్ టిమ్స్‌లో పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా అన్ని ఏర్పాట్లు పటిష్టం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సనత్‌నగర్ టిమ్స్ ట్రయల్ రన్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ట్రయల్ రన్‌లో భాగంగా ప్రస్తుతం 22 విభాగాల్లో ఓపీ సేవలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయని, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్‌రే తదితర ఆధునిక యంత్రాల ఏర్పాటు పూర్తయిందని వివరించారు.ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, డయాగ్నస్టిక్స్, రేడియాలజీ, వార్డులు, ఐసీయూల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. సనత్‌నగర్ టిమ్స్‌ను కార్డియాక్ కేర్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పూర్తై ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. వైద్య సేవలతో పాటు పారిశుధ్యం, భద్రత వంటి నాన్ మెడికల్ సేవలు కూడా సమర్థంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రోగులు, అటెండెంట్లకు భోజన సదుపాయం, అటెండెంట్ల కోసం ధర్మశాల ఏర్పాట్లు చేయాలని సూచించారు.



## రేవంత్ పాలనలో గుడుల విధ్వంసం

**మొదటిపేజీ తరువాయి**
కాకతీయ గణపతిదేవుడు నిర్మించిన చారిత్రక శివాలయాన్ని ఉద్దేశపూర్వకంగానే కూల్చేశారని విమర్శించారు. ఆలయ రక్షణ కోసం ఉన్న మట్టి ఆనకట్టను తొలగించి గర్భగుడిని ధ్వంసం చేశారని ఆరోపించారు.
అర్ధరాత్రి సమయంలో 24 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరపడం గుప్త నిధుల కోసమేనని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం పగటి పూట పనులు చేయవచ్చని, రాత్రివేళ తవ్వకాలు ఎందుకు చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పురావస్తు శాఖ ఫిర్యాదు ఆధారంగా వెంటనే కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ పర్యటనలో ఎర్రబెల్లి దయాకర్ రావు, పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పిలుపు.. దేశవ్యాప్త చర్చ!

**మొదటిపేజీ తరువాయి**
మేఘాలు కమ్ముకుని, ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో.. చమురు, బంగారం దిగుమతుల కోసం విదేశీ మారక ద్రవ్యం కరిగిపోకుండా అడ్డుకట్ట వేయడమే ఈ పిలుపులోని ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా, వర్క్ ఫ్రమ్ హోమ్ పునరుద్ధరణ, ఇంధన పొదుపు వంటి సూచనలు దేశాన్ని పెట్రో సంక్షోభం నుంచి గట్టెక్కించే ప్రయత్నమైతే, 'బంగారం కొనకండి కొనుగోళ్లు ఆపండి' అన్న నినాదం వస్తువుల డిమాండ్‌ను తగ్గించి, మార్కెట్‌లో ధరలను అదుపులోకి తెచ్చే ఒక వినూత్న ఆర్థిక ప్రయోగం. రూపాయి విలువ పతనాన్ని అడ్డుకుంటూనే, సబ్సిడీల భారం తగ్గించి ప్రభుత్వ ఖజానాను భద్రపరచాలనే ఈ 'మాస్టర్ ప్లాన్'.. దేశ ప్రజలను ఒక మానసిక సమరానికి సిద్ధం చేస్తోంది. ఇది కేవలం సామాన్య ప్రజలకు ఇచ్చిన సూచన మాత్రమేనా, లేక రాబోయే ఆర్థిక అనిశ్చితికి బలమైన హెచ్చరికా అన్న కోణంలో ఇప్పుడు దేశవ్యాప్త మేధోమథనం మొదలైంది.

**బంగారం దిగుమతులపై ఆందోళన**
భారతదేశంలో బంగారం అంటే కేవలం ఆభరణం మాత్రమే కాదు, అది ఒక సెంటిమెంట్. అయితే, మన దేశ అవసరాల కోసం ఏటా వేల టన్నుల బంగారాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల మన దేశ విదేశీ మారక నిల్వలు హరించుకుపోతున్నాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. 'శుభకార్యాల పేరుతో భారీగా బంగారం కొని దేశంపై భారం వేయకండి.. కనీసం ఏడాది పాటు ఈ కొనుగోళ్లకు విరామం ఇవ్వండి' అని ఆయన పిలుపునిచ్చారు. బంగారం కొనుగోలు తగ్గితే రూపాయి విలువ పెరిగి, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుందని ఆయన వివరించారు.

**ఇంధన పొదుపు..**
**వర్క్ ఫ్రమ్ హోమ్ పునరుద్ధరణ**
ముడి చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో, ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారానే దేశాన్ని ఆర్థికంగా కాపాడుకోగలమని మోదీ పేర్కొన్నారు. కరోనా సమయంలో మనం అనుసరించిన 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానం కేవలం ఆరోగ్య రక్షణకే కాదు, ఆర్థిక రక్షణకు కూడా తోడ్పడిందని ఆయన గుర్తు చేశారు. మళ్ళీ ఆన్‌లైన్ సమావేశాలు, వర్చువల్ మీటింగ్‌లను ప్రోత్సహించడం ద్వారా ట్రాఫిక్ తగ్గి, పెట్రోల్ మరియు డీజిల్ వినియోగం గణనీయంగా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు కూడా విలాసవంతమైన కార్ల కంటే మెట్రో, బస్సుల వంటి ప్రజా రవాణాకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**ధరల నియంత్రణకు సూత్రం!**
మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరగడానికి ప్రధాన కారణం 'డిమాండ్'. అనవసరమైన వస్తువులను కొనుగోలు చేయడం ఆపితే, వాటి డిమాండ్ తగ్గి, ధరలు వాటంతట అవే తగ్గుతాయని ప్రధాని ఒక సామాన్య ఆర్థిక సూత్రాన్ని ప్రజలకు వివరించారు. అలాగే, విదేశీ బ్రాండ్ల కంటే మన దేశీయ ఉత్పత్తులనే (వోకల్ ఫర్ లోకల్) కొనుగోలు చేయాలని కోరారు. విదేశీ పర్యటనలకు, విదేశాల్లో జరిగే పెళ్లిళ్లకు స్వస్తి చెప్పి, మన దేశంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడం ద్వారా దేశ సంపద దేశంలోనే ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

**రైతులకు మరియు సామాన్యులకు దిశానిర్దేశం**
వ్యవసాయ రంగంలో రసాయన ఎరువుల దిగుమతుల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా సబ్సిడీలు ఇస్తోందని, రైతులు సహజ సిద్ధమైన ఎరువులను వాడటం ద్వారా ఈ భారాన్ని తగ్గించవచ్చని ప్రధాని సూచించారు. విద్యుత్ పొదుపు కోసం సోలార్ పంపులు, ఎల్ఈడీ బల్బుల వాడకాన్ని ఉద్యమంలా చేపట్టాలన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించే కాలం పోయింది.. ఇప్పుడు దేశం కోసం బాధ్యతగా బతికే కాలం వచ్చింది అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రతి భారతీయుడు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే, రాబోయే రోజుల్లో భారత్ ప్రపంచంలోనే అత్యున్నత ఆర్థిక శక్తిగా ఎదగడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని ఇచ్చిన ఈ 'త్యాగంబాధ్యత' సందేశం ఇప్పుడు సోషల్ మీడియాలో సైతం భారీగా వైరల్ అవుతోంది.





# జీవో 38 ప్రకారమే వైద్యుల బదిలీలు

- **ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**
- **పారదర్శకంగానే ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ**
- **గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్‌తో సమావేశం**
- **వైద్య విద్య, సేవల బలోపేతంపై దృష్టి**

**హైదరాబాద్, మే11:**
"ప్రభుత్వం జారీ చేసిన జీవో 38 ప్రకారమే వైద్యుల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తాం" అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.
గతంలో జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్ల మాదిరిగానే ఈసారి కూడా బదిలీలను పారదర్శకంగా, ఆఫ్లైన్ విధానంలో నిర్వహించాలని వైద్యులు కోరారు. టీజీడీఏ కార్యవర్గ సభ్యులకు మినహాయింపు ఇవ్వాలని, రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారికి కూడా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాల్లో పనిచేస్తున్న వైద్యులకు హైదరాబాద్ మెడికల్ కాలేజీల్లోకి బదిలీ అవకాశాలు ఇవ్వాలని కోరారు.దీనిపై స్పందించిన మంత్రి, ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే బదిలీలు చేపడతామని తెలిపారు. మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అడ్మినిస్ట్రేషన్, బోధన, క్లినికల్ సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో వైద్య విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇందుకు వైద్యుల సహకారం అవసరమన్నారు.సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, సంగీత సత్య నారాయణ, గౌరవ్ ఉప్పల్, నరేంద్ర కుమార్, అజయ్ కుమార్, నరహరి, లాలూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

**మొదటిపేజీ తరువాయి**
మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన 'ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో □ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి. అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సవి□క్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమ□ల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల □ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు. □ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటి? ప్రభుత్వ స్కూళ్లలో లోపం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలి. అందుకే మేము ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నాం' అని ముఖ్యమంత్రి ప్రకటించారు. బ్జడెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామన్నారు. 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని, ఇక్కడ చదువుకున్న పేద బిడ్డలు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచినట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాలు, రాగిజావతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని, కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. అలాగే రూ. 1,000 కోట్లతో ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ వస్తువుల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని పేర్కొన్నారు. 'విద్యార్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని బొక్కలో తోయించే బాధ్యత నాది అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ, వారికి ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని సీఎం చెప్పారు. 'టీచర్లకు ఇది కేవలం ఉద్యోగం కాదు.. అదొక బాధ్యత. 19 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు వి□ చేతుల్లో ఉంది. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పనిచేయాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కావని, అవి అభివృద్ధి వేదికలని చాటిచెప్పేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.

# బీజేపీ సభలో ప్రధాని వ్యాఖ్యలు సరికాదు

**మొదటిపేజీ తరువాయి**

కొనొద్దు” వంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.
గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మెట్రో రైలు, ట్రిపుల్ ఆర్, రేడియల్ రోడ్లు వంటి అంశాల్లో తెలంగాణకు వివక్ష జరుగుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా బీజేపీ నేతలు ముందుకు రావడం లేదని విమర్శించారు.
కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలని, దర్యాప్తుపై ఒత్తిళ్లు తీసుకురావొద్దని హెచ్చరించారు. ప్రజలను విభజించే రాజకీయాల కంటే అందరికీ సమాన హక్కులు కల్పించే రాజకీయాలు అవసరమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# కార్మికులకు గౌరవప్రద జీవనం కల్పిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.
పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం దృష్ట్యా కార్మికుల వేతనాలను కాలానుగుణంగా సవరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వేతనాల నిర్ణయంలో కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, గృహ వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.
దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతన విధానాలను పరిశీలిస్తున్నామని, తెలంగాణకు అనువైన శాస్త్రీయ విధానాన్ని రూపొందించనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈ నిర్ణయాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.
కార్మిక సంక్షేమం కేవలం వేతనాల పెంపుతో మాత్రమే పరిమితం కాదని, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, ఉపాధి స్థిరత్వంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. త్వరలో కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, నిపుణుల అభిప్రాయాలు తీసుకుని తుది నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు.
సమావేశంలో మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరి చందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు యూరియా కొరత రాకుండా చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మే నెలాఖరు నాటికి కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రానికి ఖరీఫ్ కోసం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని కేంద్రాన్ని కోరగా, 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఏప్రిల్‌లో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందాయని వెల్లడించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువులను ఎమ్మార్పి కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, కంపెనీలు కూడా ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్‌ను ఆదర్శంగా తీసుకుని కేంద్రం కొత్త యాప్‌ను రూపొందించిందని, మే 21 నుంచి దేశవ్యాప్తంగా రెండు జిల్లాల చొప్పున ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలను ఎంపిక చేసినట్లు చెప్పారు.ః సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని మంత్రి కోరారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగించాలని సూచించారు.

# ఔషధ రవాణాలో రైల్వే కీలక ముందడుగు

- ‘ఔషధి ఎక్స్‌ప్రెస్’ ప్రారంభంపై మంత్రి కిషన్‌రెడ్డి హర్షం



**హైదరాబాద్, మే 11 :**

ప్రయాణికుల సేవలు, వస్తు రవాణాతోపాటు అత్యాధునిక సేవలు కల్పించడంలో నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలతో దూసుకుపోతున్న భారతీయ రైల్వే ఇప్పుడు ఔషధాల రవాణాపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీఎం గతిశక్తి కార్యక్రమానికి కొనసాగింపుగా ఫార్మా క్యాపిటల్ ఆఫ్ ఇండియా అయిన హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్(జేఎన్‌పీటీ)కు ఔషధాలను సరఫరా చేసేందుకు ఈనెల 2న ఔషధి ఎక్స్‌ప్రెస్ పేరుతో దేశంలోనే తొలి ప్రత్యేక ఫార్మసీ రైలును ప్రారంభించడం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మొదటి రెగ్యులర్ ‘ఔషధి ఎక్స్‌ప్రెస’ను తెలంగాణకు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు ధన్యవాదములు తెలియజేశారు. ఫార్మా కంపెనీలకు కేంద్రమైన హైదరాబాద్‌లో తయారయ్యే ఫార్మా ఉత్పత్తులను దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించడంతోపాటు అంతర్జాతీయంగా పంపిణీ చేసేందుకు ముంబై సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్టుకు తరలించడం తప్పనిసరి. అందుకే హైదరాబాద్‌ను, జేఎన్‌పీను అనుసంధానిస్తూ ఈ ప్రత్యేక రీఫర్ రైలు (కోల్డ్ స్టోరేజ్ వసతి గల రైలు)ను ప్రారంభించడం హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు ఎంతో మేలు కలగ□గనుంది. దీంతోపాటు దేశవ్యాప్తంగా, వివిధ దేశాలకు సరైన సమయంలో ఔషధాలను చేరవేసేందుకు వీలు కలుగుతుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా, పటాన్‌చెరులోని ఫార్మా జోన్, ముచ్చర్లలోని ఫ్యూచర్ సిటీ తదితర ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే ఫార్మా ప్రొడక్ట్స్ సరఫరాకు ఈ రైలు చాలా కీలకం కానుంది. దేశవ్యాప్తంగా తక్కువ ఖర్చులో వస్తు రవాణా జరగడంతోపాటు సుస్థిరమైన, పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం రూ.100 లక్షల కోట్ల వ్యయంతో పీఎం గతిశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ప్రత్యేక ‘ఔషధి ఎక్స్‌ప్రెస’ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వరంగ సంస్థ అయిన కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కాంకర్) ఆధ్వర్యంలో నడుస్తున్న సనత్‌నగర్‌లోని ఇన్ ల్యాండ్ కంటైనర్ డిపో (ఐసీడీ) నుండి ఈ ప్రత్యేక రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ‘ఔషధి ఎక్స్‌ప్రెస్’గా నామకరణం చేసిన ఈ రెఫ్రిజిరేటర్ రైలు ద్వారా లైఫ్ సేవింగ్ మందులతోపాటు అవసరమైన ఇతర సరకులను కూడా రవాణా చేయనున్నారు. హైదరాబాద్ నుంచి జేఎన్‌పీటీ వరకు ప్రయాణిస్తున్న సమయంలో కంటిన్యూయస్ రిఫ్రిజిరేషన్ ఉండేందుకు డీజిల్ పవర్ ప్యాక్‌లతో కూడిన అధునాతన రీఫర్ కంటైనర్లను వినియోగిస్తున్నారు. ఇది మన కోల్డ్‌చైన్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఫార్మాసూటికల్స్ సప్లయ్ చైన్ కెపాసిటీని పెంచేందుకు కీలకమైన ముందడుగు కానుంది. ప్రస్తుతానికి వారానికి ఒకసారి నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్‌ను డిమాండ్, వాణిజ్య వర్గాల అవసరాలకు అనుగుణంగా వారానికి రెండుసార్లు నడిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా ఇన్నొవేషన్ బేస్డ్ సొల్యూషన్స్ తీసుకురావడంలో మోదీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త అవకాశాలకు ప్రోత్సాహాన్ని అందిస్తోందని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

# మనుషులకు వీధి కుక్కల రక్తం?!

**తెలంగాణ బ్యూరో, మే11:**

రక్తం ఇప్పుడు మనిషికైనా జంతువులకైనా అత్యవసరం .సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో వైద్య విప్లవం మూలంగా ఒక వైపు రోగాలకు మరో వైపు చికిత్సకు సైతం భారత దేశమే ప్రధాన కేంద్రంగా మారింది. ఇప్పుడు సగటున 50 శాతము వ్యాధిగ్రస్తుల్లో రక్తహీనత ప్రధాన సమస్య అందులో కొన్ని గ్రూపుల రక్తం అస్సలు దొరకదు. అందుకే రక్తాన్ని నిల్వవుంచే కేంద్రాలు లెక్కలేనన్ని పుట్టుకొచ్చాయి. చాలావరకు స్వచ్ఛందంగా సేవ చేస్తున్నామనే ముసుగులో రక్తం పిండి అమ్మేస్తున్నారు. కానీ వందల సంఖ్యలో బ్లడ్ బ్యాంక్స్ ఉన్నా ఇంకా రక్తం కొరత మాత్రం అంతే ఉంది.సామజిక మాధ్యమాల్లో సమస్య ఇది అని చెబితే కొంత మేర రక్తం దానం ఇచ్చే వారు ఉన్నారు . ఐనప్పటికీ సామాన్యులకు రక్తం అందుబాటులో లేని పరిస్థితి . ఇలాంటి పరిస్థితులను వ్యాపారంగా మార్చుకునేందుకు హైదరాబాద్ చెందిన ఒక ఆసుపత్రి పెద్ద ప్లాన్ వేసింది. ప్రస్తుతం మనుషుల రక్తంతోనే వ్యాపారం చేస్తున్న కొందరిని మించి వీధి కుక్కలు, మేకలు, గొర్రెల రక్తంతో దందాకు తెర లేపారు. మూగజీవాల రక్తం నుంచి ప్లేట్‌లెట్లను తీసి మనుషులకు ఎక్కిస్తూ ప్రాణాలతో చెలగాటమాడే మాఫియా గుట్టురట్టయిన కొద్ది రోజుల్లోనే.. పెట్స్ యజమానులను బెదిరించి కుక్కల రక్తం తీసి విక్రయిస్తున్న ముఠా పట్టుబడింది. ఇటీవల ప్లాస్మాను సేకరించి అమ్ముకున్న ప్రయివేటు బ్లడ్ బ్యాంకుల లైసెన్స్‌లు రద్దు చేయగా.. ఈ ఘటనతో పలు ఆస్పత్రులపై కూడా అధికారులు నిఘా పెట్టారు.

**ఆస్పత్రి సీజ్**

రాయదుర్గంలో ఉన్న పెట్స్‌కేర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మూగజీవాల రక్తంతో సాగిస్తున్న అమానవీయ దందా ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై ఢిల్లీ నుంచి జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అధికారులకు మెయిల్ చేయడం చేయడంతోపాటు వీధి కుక్కల రక్తాన్ని తీసి విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై స్పందించిన సైబరాబాద్ మున్సిపల్ అధికారులు విచారణ జరిపారు. ఈ దారుణాలపై 74 పేజీల సమగ్ర నివేదికను అధికారులు సిద్ధం చేసి ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆస్పత్రి యాజమాన్యం వీధి కుక్కలను బంధించి, వాటి నుంచి రెండు, మూడు సార్లు రక్తం తీసేవారని అధికారుల విచారణలో తేలింది. రక్తం తీసిన తర్వాత కొద్దిగా ఆహారం పెట్టి, మళ్లీ రక్తం తీసేవారని, ఇక ఆ కుక్కలో రక్తం లేదని నిర్ధారించుకున్నాక వాటిని శివారు ప్రాంతాల్లో పడేసేవారని అధికారులు గుర్తించారు. పదేండ్లుగా ఈ దందా సాగుతోందని, సమస్యలతో వచ్చే పెట్స్ యజమానులను భయపెట్టి, తప్పనిసరిగా రక్తం ఎక్కించాలని చెప్పి ఒక్కో బ్లడ్ యూనిట్‌కు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. ఇప్పటికే ఆస్పత్రి యజమాని, ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్ వెంకటేష్ యాదవ్‌ను పశుసంవర్ధక శాఖ సస్పెండ్ చేసింది.

**మనుషులకు మూగజీవాల రక్తం..!**

ఇదేంటి మేకల రక్తాన్ని మనుషులకు ఎక్కిస్తారా..? అని ఆశ్చర్యపోకండి.. అవును.. అక్రమ సంపాదనకు అలవాటుపడిన బ్లడ్ మాఫియా ఈ తరహా దందాను ఎంచుకున్నది. మేకలు, గొర్రెల రక్తం నుంచి ప్లేట్‌లెట్లను తీసి మనుషులకు ఎక్కిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. ఇటీవల మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నాగారంలో వెలుగు చూసిన ఈ ఘటన వైద్యరంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. కీసర పోలీసులు నాగారంలోని చికెన్ షాపులపై దాడులు చేయగా.. 130 ప్యాకెట్ల మేకల రక్తం దొరికింది. ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్‌లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్టు విచారణలో గుర్తించారు. ఈ ‘గోట్ బ్లడ్ మాఫియా’ ఎలాంటి వైద్య ప్రమాణాలు పాటించకుండా మేకలు, గొర్రెల నుంచి అక్రమంగా రక్తం సేకరించి, దాన్ని ప్లేట్‌లెట్ల తయారీకి తరలించడం అప్పట్లో తీవ్ర ఆందోళనకు గురి చేసింది.

**స్వచ్ఛంద సేవ ముసుగులో వ్యాపారం**

పలు బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులకు హోల్ బ్లడ్ సహా ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు నిర్వహించారు. పలు బ్లడ్ బ్యాంకులను గుర్తించి, లైసెన్సులను రద్దు చేశారు. హోల్ బ్లడ్ సహా ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌ను ఆయా బ్లడ్ బ్యాంకుల సామర్థ్యానికి మించి నిల్వ చేసి, మార్కెట్లో కృత్రిమ కొరతను సృష్టిస్తుండటంతో అధికారులు రంగంలోకి దిగారు. బ్లడ్, ప్లాస్మాను అమ్ముకుంటున్న శ్రీకర హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, న్యూలైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్లడ్ బ్యాంకుల లైసెన్స్‌ను రద్దు చేశారు. మూసాపేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో హీమో సర్వీస్ పేరిట నడుస్తున్న ఓ ల్యాబ్‌లో డీసీఏ అధికారులు ఈ తనిఖీలు చేశారు. డీసీఏ లైసెన్స్ లేకుండా నడిపిస్తున్న ఈ ల్యాబ్ నుంచి తెలంగాణ, కర్నాటక, ఏపీలోని పలు ఫార్మా కంపెనీలు, హాస్పిటళ్లు, రీసెర్చ్ ల్యాబ్స్‌కు రక్తం, ప్లాస్మాను అక్రమంగా విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. మియాపూర్ మదీనగూడలోని శ్రీకర్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, దారుల్‌షిఫాలోని అబిద్ అలీఖాన్ లయన్స్ ఐ హాస్పిటల్స్‌లో ఉన్న న్యూలైఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ బ్లడ్ సెంటర్ వాళ్లు డోనర్ల నుంచి రక్తాన్ని సేకరించి, ప్లాస్మాఫెరెసిస్ అనే ప్రక్రియ ద్వారా రక్తం నుంచి ప్లాస్మాను వేరు చేసి, హీమో సర్వీసెస్‌కు అమ్ముతున్నట్టు విచారణలో తేలింది. దీంతో ఆ రెండు బ్లడ్ బ్యాంకుల్లో సోదాలు చేసి ప్లాస్మా అమ్మకాలకు సంబంధించిన ఆధారాలను అధకారులు స్వాధీనం చేసుకున్నారు. 2016 నుంచి ఈ దందా జరుగుతోందనీ, లైసెన్స్ రద్దు చేసే నాటికి 6 వేల యూనిట్లకుపైగా ప్లాస్మా యూనిట్లను హీమో సర్వీస్ సేకరించిందని డీసీఏ అధికారులు గుర్తించారు. ఒక్కో యూనిట్ ప్లాస్మాను రూ.700కు కొని, రూ.3,800కు అమ్ముతున్నట్టు గుర్తించారు.

**ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులపై నిఘా**

ఇటీవల వరుస బ్లడ్ మాఫియా ఘటనలతో నగరంలోని అన్ని ప్రయివేటు పెట్ హాస్పిటల్స్, బ్లడ్ బ్యాంకులపై అధికారులు నిఘా పెట్టారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, డ్రగ్స్ కంట్రోల్, మెడికల్ కౌన్సిల్, వెటర్నరీ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీసులు కలిసి బ్లడ్ బ్యాంకులు, బయోలాజికల్ ఉత్పత్తుల ల్యాబ్స్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని చూస్తున్నట్టు సమాచారం.

# దేశ నైపుణ్య రాజధానిగా తెలంగాణ

**హైదరాబాద్, మే11:**



“తెలంగాణను దేశ నైపుణ్య రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం” అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. “ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక”లో భాగంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యువజన, క్రీడల జాబ్ మేళా-2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్లింగ్, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కొత్త ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా యువతను సిద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జాబ్ మేళాలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు చెందిన యువత భారీగా పాల్గొన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి ఉద్యోగ అవకాశాలపై అవగాహన పొందారు. నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అవసరాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాలు పెంపొందితే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని జిల్లాల్లో కూడా ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



# భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- **బీఆర్ఎస్ మహిళా నేతల డిమాండ్**
- **మహిళా కమిషన్‌కు వినతిపత్రం**
- **బాధిత కుటుంబాన్ని వేధిస్తున్నారంటూ ఆరోపణలు**
- **కేసును నీరుగార్చొద్దని డిమాండ్**

**హైదరాబాద్, మే11:**

మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మహిళా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన నేతలు, ఘటనపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. బాధితురాలి కుటుంబాన్ని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ, దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, రాజకీయ ప్రభావాలకు లొంగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతుండగా, బీఆర్ఎస్ నాయకులు పలు ప్రాంతాల్లో నిరసనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఆరోపణలపై బండి సంజయ్ కుటుంబం నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. వినతిపత్రాన్ని స్వీకరించిన మహిళా కమిషన్ అధికారులు విషయాన్ని పరిశీలిస్తామని తెలిపినట్లు సమాచారం.

# రిటైర్డ్ ఐపీఎస్ అధికారి హత్య కేసులో కీలక మలుపు

- **ప్రధాన నిందితురాలు కల్పన పూణెలో అరెస్ట్**
- **నేపాల్ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు పోలీసుల నిర్ధారణ**
- **దోపిడీ బంగారం ముంబైలో దాచినట్లు గుర్తింపు**
- **మరిన్ని అరెస్టులపై దృష్టి పెట్టిన పోలీసులు**

**హైదరాబాద్, మే11:**


రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య తనూజ రంజన్ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న నేపాలీ పనిమనిషి కల్పన అలియాస్ ధర్మను మహారాష్ట్రలోని పూణెలో పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్యేక బృందాలు ఆమెను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.
ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు హైదరాబాద్, పూణె, ముంబై, ఢిల్లీ, బిహార్ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పట్టుబడిన ఇద్దరు నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా పూణెలో తలదాచుకున్న కల్పనను అదుపులోకి తీసుకున్నారు.
పోలీసుల దర్యాప్తులో ఈ హత్య వెనుక నేపాల్‌కు చెందిన సాహూ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు తేలినట్లు సమాచారం. ఢిల్లీలోని జైలు నుంచే ఈ దోపిడీ, హత్యకు సంబంధించిన పథకం రచించినట్లు గుర్తించారు. ముంబై, నేపాల్, పాట్నా ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో ప్రత్యేక ముఠా ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో బయటపడింది.
హత్య అనంతరం దోపిడీ చేసిన బంగారాన్ని ముంబైలో దాచిపెట్టినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. నిందితుల ఫోన్ సంభాషణలు, ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. కల్పనను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన అనంతరం ప్రత్యేకంగా విచారించనున్నారు. హత్యకు అసలు కారణాలు, దోపిడీ చేసిన ఆభరణాల తరలింపు, ఇతర నిందితుల పాత్రపై కీలక సమాచారం రాబట్టే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.



# తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- **ఎంపీ ఈటల రాజేందర్**
- **ప్రధాని సభ విజయంతో కేడర్‌లో ఉత్సాహం**
- **ప్రజా సమస్యలు పట్టించుకునేది బీజేపీయే**

**హైదరాబాద్, మే11:**



“రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో గెలిచేది బీజేపీయే.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం” అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం కావడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు.
కంటోన్మెంట్‌లోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఈటల, ప్రధాని సభకు భారీగా ప్రజలు తరలివచ్చారని తెలిపారు. సభా ప్రాంగణం వెలుపల కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో సభ విజయవంతమైందన్నారు.
రాష్ట్రంలో ప్రజా సమస్యలను నిజంగా పట్టించుకునే ఏకైక పార్టీ బీజేపీయేనని ఈటల వ్యాఖ్యానించారు. తాను 365 రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రధాని మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత దేశవ్యాప్తంగా బీజేపీ మరింత బలపడుతోందన్నారు. తెలంగాణలో అప్పుల సమస్య, రైతులు, విద్యార్థుల ఇబ్బందులకు పరిష్కారం కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును ఈటల గుర్తు చేశారు. “మేక్ ఇన్ ఇండియా”, “మేడ్ ఇన్ ఇండియా” లక్ష్యాలతో దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని తెలిపారు.
రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేసిన ఈటల, ప్రధాని రాష్ట్రానికి వచ్చినప్పుడు నిధులు అడిగి తర్వాత విమర్శలు చేయడం సరికాదన్నారు. కేంద్ర నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని వ్యాఖ్యానించారు.



సంపాదకీయం

# రాజకీయ పార్టీల్లో 'సర్' భయాలు!

## బోగస్, డబుల్ ఓట్ల తొలగింపుపై పార్టీల్లో గుబులు

## ప్రక్రియపై అప్రమత్తమైన కాంగ్రెస్, బీఆర్ఎస్, వైసీపీ

**'స్పెషల్ ఇన్టెన్సివ్ రిజర్వేషన్' (సర్) ప్రక్రియ పేరు వినగానే రాజకీయ పార్టీల్లో ఆందోళన మొదలైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలో చేపట్టబోతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన కార్యక్రమం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రక్రియ ద్వారా చనిపోయిన వారి పేర్లు, బోగస్ ఓట్లు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓట్లను గుర్తించి తొలగించనుండటంతో రాజకీయ పార్టీలు అప్రమత్తమవుతున్నాయి.**

ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ అమలైంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ నాయకులు, కార్యకర్తలకు బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేస్తున్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు హెచ్చరికలు పంపుతున్నాయి. అయితే ఓటర్ల జాబితా ప్రక్షాళన కొత్త విషయం కాదు. 1951 నుంచి 2004 వరకు దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక పరిశీలన కార్యక్రమాలు ఎనిమిది సార్లు నిర్వహించబడ్డాయి. కానీ 21 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ప్రక్రియ చేపట్టడంతో రాజకీయ దుమారం చెలరేగుతోంది. గతంలో పెద్దగా వివాదాలు రాకపోయినా, ప్రస్తుతం మాత్రం ప్రతి చర్య రాజకీయ కోణంలోనే కనిపిస్తోంది. సర్ ప్రక్రియ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారనే ఆరోపణలు కొన్ని రాష్ట్రాల్లో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం పూర్తిస్థాయి పరిశీలనతోనే చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత కీలకమైన హక్కు. ప్రజాస్వామ్యంలో ఓటరు నమోదవడం ఎంత ముఖ్యమో, అర్హత లేని ఓట్లు తొలగించడం కూడా అంతే అవసరం. చనిపోయిన వారి పేర్లు సంవత్సరాల తరబడి జాబితాలో కొనసాగడం, ఒకే వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండటం, ఇతర రాష్ట్రాల్లో కూడా పేర్లు ఉండటం వంటి సమస్యలు ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్న ఉదాహరణలు అనేకం. రెండు విడతల ఎన్నికల సమయంలో రెండు చోట్ల ఓటు వేసిన ఘటనలూ వెలుగుచూశాయి. రాజకీయ పార్టీలు కూడా తమకు అనుకూలంగా బోగస్ ఓట్లను చేర్పించుకునేందుకు ప్రయత్నించాయన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. అందుకే ఇప్పుడు జరుగుతున్న పరిశీలనను కొందరు అవసరమైన సంస్కరణగా చూస్తున్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో అనుమానాస్పద ఓట్లను తొలగించినట్లు సమాచారం. చొరబాటుదారులు, అక్రమ వలసదారులు, నకిలీ పత్రాలతో నమోదైన ఓట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని ఎన్నికల సంఘం గుర్తించింది. దీంతో అక్కడ రాజకీయ వివాదాలు తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఆధునిక సాంకేతికతను ఉపయోగించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆధార్, ఫోన్ నంబర్, బయోమెట్రిక్ వ్యవస్థలతో ఓటరు కార్డులను అనుసంధానం చేస్తే డబుల్ ఓట్లు, బోగస్ ఓట్లను సులభంగా అరికట్టవచ్చు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డులు ఆధార్‌తో లింక్ చేసినట్లే ఓటరు కార్డులను కూడా లింక్ చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. అదేవిధంగా ఓటరు జీవించి ఉన్నాడని నిర్ధారించుకునే ఆన్‌లైన్ ధృవీకరణ విధానం తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి, బయోమెట్రిక్ ఆధారిత ఓటింగ్ విధానం తీసుకువస్తే ఎన్నికల వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని భావిస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగితే ఖచ్చితంగా ప్రశ్నించాలి. అదే సమయంలో బోగస్ ఓట్ల తొలగింపుకు కూడా సహకరించాలి. కానీ కొన్ని పార్టీలు మాత్రం తమ రాజకీయ ప్రయోజనాలకు దెబ్బ తగులుతుందనే భయంతో సర్ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి 'సర్' ప్రక్రియ ఇప్పుడు కేవలం ఓటర్ల జాబితా పరిశీలన మాత్రమే కాకుండా రాజకీయ వేడిని పెంచుతున్న కీలక అంశంగా మారింది. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయాలంటే పారదర్శకమైన ఓటరు వ్యవస్థ అవసరం. అదే సమయంలో నిజమైన ఓటరికి అన్యాయం జరగకుండా చూడటం కూడా ఎన్నికల సంఘం ముందున్న అతిపెద్ద సవాల్‌గా మారింది.

# జూలై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' అమలు



- 125 రోజులకు పెరగనున్న పనిదినాలు
- 20 ఏళ్ల నాటి చట్టానికి కేంద్రం స్వస్తి

**న్యూఢిల్లీ, మే 11:** దేశంలోని గ్రామీణ ఉపాధి రంగంలో కేంద్ర ప్రభుత్వం భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. గత రెండు దశాబ్దాలుగా కోట్లాది కుటుంబాలకు ఆసరాగా ఉన్న 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం'ను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీని స్థానంలో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్' పేరుతో సరికొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ నూతన వ్యవస్థ 2026, జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సోమవారం అధికారికంగా ప్రకటించింది.

### 125 రోజుల ఉపాధి గ్యారెంటీ

ప్రస్తుతం అమల్లో ఉన్న ఎంజీనరేగా పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి గరిష్ఠంగా 100 రోజుల పని కల్పిస్తుండగా, కొత్తగా రాబోతున్న 'వీబీ జీ రామ్ జీ' చట్టం ద్వారా ఆ పరిమితిని 125 రోజులకు పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పనిదినాలను పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా ఈ మార్పులు చేసినట్లు కేంద్రం పేర్కొంది.

### తొలగనున్న ఈ-కేవైసీ చిక్కులు

పథకాల మార్పు సమయంలో కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం కీలక హామీ ఇచ్చింది. ప్రస్తుతమున్న ఈ-కేవైసీ జాబ్ కార్డులే కొత్త కార్డులు వచ్చే వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరికైనా ఈ-కేవైసీ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నా, వారికి ఉపాధి కల్పించడంలో ఎలాంటి అడ్డంకులు ఉండవని భరోసా ఇచ్చింది. జూన్ 30, 2026 నాటికి ఎంజీనరేగా కింద కొనసాగుతున్న అన్ని ప్రాజెక్టులు జులై 1 నుంచి నేరుగా కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని, పనులు ఎక్కడా నిలిచిపోవని అధికారులు తెలిపారు.

### నిధుల కేటాయింపులో కొత్త విధానం

కొత్త చట్టం ప్రకారం నిధుల కేటాయింపులో కూడా మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈసారి ఉపాధి హామీ కోసం ఏకంగా రూ. 1.51 లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌ను అంచనా వేస్తున్నారు. అలాగే పనుల పర్యవేక్షణ కోసం జీపీఎస్ ట్రాకింగ్, రియల్ టైమ్ డ్యాష్ బోర్డులు వంటి అత్యాధునిక సాంకేతికతను వాడనున్నారు. పనుల ఎంపికలో కూడా జలవనరుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# భార్య భర్తకు బానిస కాదు..

- జంతువులా చూసే హక్కు లేదు
- ఆత్మగౌరవంతో బతికే హక్కు అందరికీ ఉంది
- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- గృహ హింస కేసులో నిందితుడి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ



**న్యూఢిల్లీ, మే 11 :** భార్య అంటే భర్తకు బానిస కాదని, ఆమెను జంతువులా చూసే హక్కు ఎవరికీ లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. వివాహ బంధంలో ఉన్నంత మాత్రాన మహిళ తన ఆత్మగౌరవాన్ని వదులుకోవాల్సిన అవసరం లేదని, గౌరవంగా జీవించే హక్కు ఆమెకు ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. గృహ హింస కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఓ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. పాట్నా హైకోర్టు ముందస్తు బెయిల్‌ను తిరస్కరించడంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా అతనికి నిరాశే ఎదురైంది. నిందితుడు తన మొదటి భార్యపై మద్యం మత్తులో దాడి చేశాడని, ఆమెను నేలపైకి నెట్టివేయడంతో తలకు ఇటుక తగిలి తీవ్ర గాయమైందని ప్రాసిక్యూషన్ కోర్టుకు వివరించింది. అంతేకాకుండా నిందితుడికి మొత్తం ముగ్గురు భార్యలు ఉన్నారని, బాధిత మహిళకు ఎటువంటి ఆర్థిక సాయం అందించడం లేదని తెలిపింది. అయితే, సదరు మహిళతో తనకు పెళ్లే కాలేదని నిందితుడు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది.

### మద్యం మత్తులో దాడులపై ఆందోళన

ఈ సందర్భంగా జస్టిస్ వరాలే స్పందిస్తూ.. భార్య పట్ల ఈ విధంగా క్రూరంగా ప్రవర్తించడాన్ని ఏమాత్రం సమర్థించలేమని మండిపడ్డారు. జస్టిస్ కుమార్ జోక్యం చేసుకుంటూ.. "మీరు భార్యను ఎందుకు కొట్టాలనుకుంటున్నారు? ఇలాగే కొడితే ఇప్పుడున్న భార్య కూడా మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతుంది" అని నిందితుడిని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే గృహ హింస కేసుల్లో మద్యం సేవించి భార్యలపై దాడి చేయడం అనేది ఒక సాధారణ పద్ధతిగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు తమ భర్తలు మద్యం తాగడాన్ని భరించినా, తాగిన తర్వాత చేసే దాడులను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అభిప్రాయపడ్డారు. నిందితుడిపై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవని పేర్కొంటూ, ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది.




# జవాబుదారీతనం లేని ప్రధాని ప్రసంగం

## ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం

## ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, మే 11:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

# ఇంధన భద్రతపై రాజ్‌నాథ్ సింగ్ కీలక భేటీ

### నిత్యావసరాల కొరత రాకుండా చర్యలు

**న్యూఢిల్లీ, మే 11 :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దేశ ఇంధన భద్రత, నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థలపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి అప్రమత్తత ప్రకటించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సోమవారం 'అనధికార మంత్రుల బృందం' 5వ సమావేశం జరిగింది. గ్లోబల్ సప్లై చైన్ (ప్రపంచ సరఫరా గొలుసు) దెబ్బతినే ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, దేశీయంగా వస్తువుల లభ్యత మరియు ధరల నియంత్రణపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని భరోసా ఇచ్చారు. నిత్యావసరాల కొరత రాకుండా పటిష్ఠమైన ప్రణాళికలు సిద్ధం చేశామని, ప్రజలు అనవసరంగా వస్తువులను నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.



### 60 రోజులకు సరిపడా నిల్వలు

గత ఏప్రిల్ 18న జరిగిన నాలుగో సమావేశంలో దేశంలో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నేటి ఐదో సమావేశంలో ఆ నిల్వలను మరింత పటిష్ఠం చేయడం, ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను కాపాడాలని నిర్ణయించారు. యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, దేశంలో ఉప్పు, పప్పు వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా నిరంతర నిఘా ఉంచుతున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

### సిఎం ఎవరనేదానిపై తేల్చుకోలేని పార్టీ

**న్యూఢిల్లీ/ తిరువనంతపురం:** తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.





# వికలాంగులకు చెక్కుల పంపిణీ చేసిన హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శేరిలింగంపల్లిలో హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది వికలాంగులకు చెక్కులు అందజేశారు. ప్రతి నెలా సంస్థ తరఫున రూ.500 చొప్పున చెక్కులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి సంస్థకు సహకరించాలని, ఆర్థిక సాయం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి నెల 10వ తేదీన వికలాంగులకు చెక్కులు పంపిణీ చేస్తామని తెలిపారు. కుల, మత భేదాలు లేకుండా అందరి కోసం ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంస్థ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ పొందిందని, అంతర్జాతీయ స్థాయిలో కూడా సేవలు అందిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ అబ్దుల్ రెహమాన్, షైక్ అహమ్మద్, శివ కుమార్, శంకర్ రావు, ధర్మేందర్, టాస్లీమ్ బేగం, ఎం డి గౌస్, ఎం డి నిస్సర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగారం ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ క్యాంప్



**నాగారం, రాజముద్ర న్యూస్:** కీసర మండల పరిధి నాగారం ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పర్సనాలిటీ డెవలప్మెంట్, కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, యోగ,లైఫ్ స్కిల్స్ మొదలగు అంశాలతో కూడిన వేసవి సెలవులలో విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిసి రాములు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి జమదగ్ని హాజరైనారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కీసర మండలంలోనే నాగారం, రాంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువులో మంచి ఫలితాలు సాధిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారని ప్రశంసించారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ను ఉపయోగించుకోవాలని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిర మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్ లో తమ పిల్లలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా ఇన్స్ట్రక్టర్,పాఠశాల ఇంచార్జి ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి , ఉపాధ్యాయులు అరవింద్ కుమార్,మాలోత్ నాయక్,వందన, వరమ్మా, సంధ్యా రాణి, సుమతి, రమా సత్యశ్రీ, గాయత్రీ, సంజయ్ రాణీ, కౌసల్య, పద్మా లు తదితరులు పాల్గొన్నారు.

## సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలి

### అదనపు జిల్లా కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు జిల్లా కలెక్టర్లు డిఆర్ఓ చంద్రావతి తో కలిసి అదనపు కలెక్టరు (134) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే లక్ష్యంగా వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్వయంగా ఫిర్యాదుదారులను కలిసి వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. బాధితులు తమ ఫిర్యాదుల కోసం ఎప్పుడైనా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఆపదలో ఉన్న వారికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల నుండి పలు ఫిర్యాదులు అందడం జరిగింది. వీటిపై తక్షణమే స్పందించిన ఎస్పీ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫోన్ ద్వారా సంప్రదించి, ఫిర్యాదుల గురించి ఆరా తీశారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల ఫిర్యాదుల పట్ల అత్యంత మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని కంప్యూటరైజ్ చేస్తున్నామని తద్వారా ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితులు అవసరం అనుకుంటే నేరుగా తనను కలవవచ్చని తెలిపారు.

## చెట్టుకొమ్మల వివాదం.. గొడ్డలితో దాడి

### వృద్ధుడిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పెద్దతండా ముతాపురం గ్రామంలో చెట్టుకొమ్మలు నరకాలని అడిగినందుకు వృద్ధుడిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్దతండా ముతాపురం గ్రామానికి చెందిన జర్పుల చలపతి సోమవారం సాయంత్రం తన ఇంటి పక్కన ఉండే గుగులోతు ప్రవీణ్‌ను చెట్టుకొమ్మలు నరకమని కోరాడు. దీనికి ఆగ్రహించిన గుగులోతు ప్రవీణ్, గుగులోతు రాజు, గుగులోతు ఉపేందర్, బానోతు రాంబాయి కలిసి 'ఎందుకు నరకాలి' అంటూ బూతులు తిడుతూ బెదిరింపులకు దిగారు. వివాదం ముదరడంతో గుగులోతు ప్రవీణ్ గొడ్డలి తీసుకొని ఫిర్యాదుదారుడి తండ్రి చలపతి తలపై బలంగా కొట్టాడు. దీంతో చలపతికి తలపై తీవ్ర రక్తగాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.కేసు నమోదు బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై పి. సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గుగులోతు ప్రవీణ్, గుగులోతు రాజు, గుగులోతు ఉపేందర్, బానోతు రాంబాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

### ఏడుగురు అరెస్ట్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా తెలిపారు. సోమవారం అందిన ఖచ్చితమైన సమాచారం మేరకు, వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అలంపల్లి ప్రభుత్వ పాఠశాల సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక దాడి నిర్వహించింది. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ధరూర్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన గౌరప్ప, ఈ. గోపాల్, గంధం గోపాల్, కె. బాలయ్య, ఈ. హరీష్‌లతో పాటు మార్పల్లి మండలం కోటెమర్పల్లికి చెందిన ఎస్. వెంకట్ రెడ్డి, వికారాబాద్‌కు చెందిన బి. శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. నిందితుల వద్ద నుండి మొత్తం రూ. 26,355 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను,స్వాధీనం చేసుకున్న నగదును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా మాట్లాడుతూ...జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లాలో ఎక్కడైనా పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి, ఎక్కడైనా చట్టవిరుద్ధమైన పనులు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## "ప్రజావాణి" లో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్ల కోసం సిపిఐ పార్టీ వినతి

- అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలంటూ సిపిఐ డిమాండ్..
- మేడ్చల్ కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించిన సిపిఐ పార్టీ నాయకులు..



**జవహర్ నగర్, రాజముద్ర న్యూస్:** కాప్రా మండలంలోని జవహర్ నగర్ లో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలన్నింటికీ తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటపల్లి శంకర్ నేతృత్వంలో నాయకులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. గత ప్రభుత్వ వైఫల్యంపై తోటపల్లి శంకర్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం వేలాదిమంది నీరుపేదలు దరఖాస్తు చేసుకున్నారని, అయితే వారికి ఇళ్లు కేటాయించకుండా కాలయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా పేదల సొంతింటి కల నెరవేరలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విన్నపం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అవస్థలను దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిశీలించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శనం యాదగిరి, కాప్రా మండల కార్యదర్శి బి. స్వరూప నాయక్, సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాల ఎల్లయ్య, (ఏఐటీయూసీ మండల అధ్యక్షులు కొండా సత్యం సాగర్, గిరి ప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి బి. నాని సురేష్ శాఖ సహాయ కార్యదర్శి గిరి ప్రసాద్ నగర్ ఇతర కార్యకర్తలు పాల్గొని ముక్తా కంఠంగా పేదలకు న్యాయం జరిగే వరకు సిపిఐ పోరాటం కొనసాగిస్తుందనీ స్పష్టం చేశారు.

# మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం



**కామారెడ్డి రాజముద్ర న్యూస్:** బిక్నూర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్ ప్రమాణ స్వీకారం మండల కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం మాజీ మంత్రి ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకుడు ఇలియాజ్ భాయ్, కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డీ, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పిసిసి జనరల్ సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఉమారాణి శ్రీనివాస్, మాజీ డిసిసి అధ్యక్షులు కైలా శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు పాల్గొనడం జరిగింది, ఈ కార్యక్రమంలో పోసానిపేట గ్రామ మాజీ సర్పంచ్ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన కామారెడ్డి జిల్లా కన్వీనర్ గిరెడ్డి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సమ్మర్ క్లాసులు ప్రారంభం

## ఎంఈఓ ఆనందరావు



**రామారెడ్డి రాజ ముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలోని రెడ్డిపేట్ ఉన్నత పాఠశాల యందు సమ్మర్ క్యాంప్ ప్రారంభమైంది ఇట్టి సమ్మర్ క్యాంపును వినియోగించుకోవడానికి 26 మంది విద్యార్థులు హాజరైనారు ప్రారంభ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఆనందరావు గ్రామ సర్పంచ్ రాజేందర్, ఉప సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, పంచాయతీ సెక్రెటరీ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు హెచ్ఎం గోపాల్ రెడ్డి తెలియజేశారు, సమ్మర్ క్యాంప్ నందు విద్యార్థులు చెస్, క్యారం, యోగ , పెయింటింగ్, అండ్ డ్రాయింగ్ అంశాలపై శిక్షణ ఉంటుందని విద్యార్థులు క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఆనందరావు తెలియ చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్



**రాజముద్ర న్యూస్, బోథ్:** బోథ్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 4 LED టీవీలను బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్‌ను పరిశీలించరు ఈ సందర్భంగా సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్ గారు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు డిజిటల్ క్లాసుల ద్వారా విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమవుతాయని తెలిపారు అలాగే జూన్ 1వ తేదీ నుండి ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం కానుందని,విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు మరియు డ్రెస్‌లను కూడా ప్రభుత్వం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు విద్యార్థులు ప్రభుత్వ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ నాందేవ్, నగేష్ గౌడ్, డిపార్ట్మెంట్ ఆఫీసార్ రాజేందర్, లక్ష్మణ్, అనిల్, సిహెచ్ రవి,యు అనిల్, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వరి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ నాయకులు ఎం వెంకటయ్య లు మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన పంటలు వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రతి రైతు వేదికల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. గిట్టుబాటు ధరలు కల్పించాలి, కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీళ్లు టెంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. క్వింటాలుకు బోనస్ 500 ఇవ్వాలని, ప్రవేటు కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి కూలీల వ్యతిరేక జీవోలు వెంటనే రద్దు చేయాలన్నరు. ఉపాధి హామీ కూలీలకు 14 వారాల పెండింగ్ డబ్బులు ఇవ్వాలని, ఉపాధి పని ప్రదేశంలో 2టైమ్ ఫోటో విధానం రద్దు చేయాలన్నారు. జిల్లాలో అనేక గ్రామాల్లో కొత్త జాబ్ కార్డులు 4ఏండ్లుగా ఇవ్వలేదు వెంటనే ఇవ్వాలి అనేక మందికి జాబ్ కార్డులు ఉన్న పనిచూపించడం లేదు. ఆన్లైన్ ఇబ్బందులు సిగ్నల్ రావడం లేదు అంటూ కులికలకు పనులు చూపడం లేదు. ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలి. 200 రోజులు పని దినాలు కల్పించాలి. రోజు కూలి307నుండి 600లకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రవేటు కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 4 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న వితంతులకు వృద్దులకు కొత్త పెన్షన్లు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వనికి డిమాండ్ చేస్తున్నాము అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ మహిపాల్ సిపిఎం జిల్లా కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు ఎం వెంకటయ్య,రామకృష్ణ శ్రీనివాస్, చంద్రయ్య, బుగ్గప్ప సుదర్శన్, సతీష్, మంగమ్మ, ఉప్పరి నర్సింలు, బుడగ నర్సింలు, వడ్డే సంతోష, వెంకటలక్ష్మి, నరసమ్మ, స్వరూప, పద్మమ్మ, యాదమ్మ, అరుణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రోళ్ల సత్తిరెడ్డి సేవలు చిరస్మరణీయం

## ఘనంగా ఎర్రోళ్ల సత్తిరెడ్డి 14వ వర్ధంతి



**కీసర, రాజముద్ర న్యూస్:** కీసర మండలం గోధుమకుంట గ్రామంలో సోమవారం మాజీ సర్పంచ్, కీసర మండల టీడీపీ అధ్యక్షుడిగా సేవలందించిన ఎర్రోళ్ల సత్తిరెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఎర్రోళ్ల సత్తిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ప్రజాసేవలో ఎర్రోళ్ల సత్తిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని కొనియాడారు. యువత ప్రజాసేవను లక్ష్యంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఎర్రోళ్ల సత్తిరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే మాజీ నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, వంగేటి పర్వత్ రెడ్డి, కే జీవన్ రెడ్డి, కీసర శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ చైర్మన్ రాయిల శ్రావణ్ కుమార్ గుప్త,గుర్రం శ్రీధర్ రెడ్డి, వరకాంత్ రెడ్డి,పాండు రెడ్డి,కృష్ణా రెడ్డి,మోహన్ రెడ్డి, జూపల్లి సూరి, అన్నంరాజు సురేష్ తో పాటు వివిధ రాజకీయ, సామాజిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంతో సొంతింటి కల సాకారం



**రాజముద్ర న్యూస్, గంగాధర :** ప్రజా ప్రభుత్వంతో సొంతింటి కల సాకారమైందని గంగాధర సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న అన్నారు. నిరుపేదల సొంతింటి కల సాకారం కావడమే నిజమైన అభివృద్ధి అని వారు పేర్కొన్నారు. గంగాధర మండలకేంద్రంలోని గొల్లపెల్లి లత– సత్తయ్య దంపతులు ఇందిరమ్మ పథకం కింద నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ మహోత్సవానికి సోమవారం వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన గృహంలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సర్పంచ్ దంపతులు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేదలకు పక్కా ఇళ్లు అందించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతోమంది కుటుంబాల్లో వెలుగులు నింపుతోందన్నారు. సామాన్య కుటుంబం తమ కష్టార్జితంతో ప్రభుత్వ సహకారంతో సొంతింటిని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ యశ్వంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం వెంకటేశం, మంత్రి మహేందర్, జంగిలి మహేశ్, గంగాధర రమేశ్ పాల్గొన్నారు.



# ‘కార్యకర్తలే పార్టీకి ప్రాణం’

- క్షేత్రస్థాయిలో సీపీఐని బలోపేతం చేయాలి: కర్నాటి భానుప్రసాద్ పిలుపు
- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధం కావాలి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకోండపల్లి: పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమరోత్సాహంతో పని చేయాలని, ప్రజా సమస్యలపై ఎర్రజెండా అండగా నిలవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్ పిలుపునిచ్చారు.

సోమవారం మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవన్‌లో జిల్లా సమితి సభ్యులు కనకబండి సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులపై నిప్పులు: "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్యుడి బతుకు భారమైంది. నిత్యావసర ధరల పెరుగుదల, నిరుద్యోగం ప్రజలను కుంగదీస్తోంది" అని భానుప్రసాద్ మండిపడ్డారు. పాలకుల వైఫల్యాలను ఎండగట్టడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

**కార్యకర్తలకు దిశానిర్దేశం:**
పార్టీని గ్రామ గ్రామాన పటిష్టం చేయాలని, ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలను చైతన్యపరిచి వారి పక్షాన నిలబడి అధికారులను నిలదీయాలని పేర్కొన్నారు. శ్రమజీవుల హక్కులు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం సీపీఐ ఎప్పుడూ ముందుంటుందని, రాబోయే రోజుల్లో పోరాట పంథాను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు పాల్తియ శ్రీనివాస రావు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండల కార్యవర్గ సభ్యులు కర్నాటి నళిని రాణి, రాయల మాధవరావు, పాలపాటి అశోక్, మండల కౌన్సిల్ సభ్యులు బాలిన కృష్ణంరాజు, గూగులోతు వేంకటేశ్వర రావు, కాశబోయిన అయోధ్య, భూక్యా వేంకటేశ్వర్లు, అనంతు పుల్లయ్య, తేజవత్ రూప్లా తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి






## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** రాజకీయాలలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. సోమవారంకూకట్‌పల్లిలోని ఎన్ కెఎన్ఆర్ గార్డెన్స్‌లో మహిళా కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కమలాక్షి రాజన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జీ పట్నం సునీత మహేందర్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ నియోజకవర్గ ఇంచార్జీ, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప, అలియాబాద్ మునిసిపల్ చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ సంస్థా గత బలోపేతం, గ్రామ స్థాయి నుంచి పార్టీ విస్తరణ, రాబోయే కార్యక్రమాల అమలు దిశగా కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి మహిళా కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుంచి మరింత శక్తివంతం చేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలంటూ “మహిళా ఆరక్షన్ బిల్ ఆజ్ కరో అభి కరో” అనే నినాదంతో పోస్ట్ కార్డులపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించారు.



# ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్లకు బీసీసీఐ హెచ్చరిక

ముంబై, మే 11 : ఐపీఎల్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న వేళ, ఫ్రాంచైజీ యజమానుల వ్యవహారశైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి అసంతృప్తి వ్యక్తం చేసింది. బోర్డు జారీ చేసిన నిబంధనలను కొందరు జట్టు యజమానులు పట్టించుకోవడం లేదని గుర్తించిన బీసీసీఐ, ఇకపై రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవల అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ప్రత్యేక మార్గదర్శకాలు పంపించారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో జట్టు యజమానులు ప్లేయింగ్ ఏరియాలోకి రావద్దని, ఆటగాళ్లు లేదా సపోర్ట్ స్టాఫ్‌తో ప్రత్యక్షంగా మాట్లాడకూడదని స్పష్టంగా ఆదేశించారు. అయితే కొందరు యజమానులు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు బోర్డు గుర్తించింది. ఐపీఎల్‌కు చెందిన ఓ అధికారి మాట్లాడుతూ.. "ఫ్రాంచైజీ ఓనర్లకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. కొందరు డగౌట్ సమీపంలో తిరుగుతూ కనిపించారు. మరికొందరు మొబైల్ ఫోన్లతో మైదానంలోకి వచ్చి ఫొటోలు కూడా తీశారు. దీనికి సంబంధించిన ఆధారాలు మా వద్ద ఉన్నాయి. పలుమార్లు హెచ్చరించినా మార్పు కనిపించకపోవడంతో ఇకపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది" అని తెలిపారు. ఇక మరోవైపు ఐపీఎల్ 2026 సీజన్‌లో 'హనీ ట్రాప్' ప్రమాదాలపై కూడా బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలను అప్రమత్తం చేసింది. ఆటగాళ్లు లేదా అధికారులపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. హై ప్రొఫైల్ క్రీడా వాతావరణాల్లో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన బీసీసీఐ, హోటళ్లలో తనిఖీలు కూడా నిర్వహిస్తోంది. ఆటగాళ్ల గదుల్లోకి అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించినట్లు తెలితే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని బోర్డు హెచ్చరించింది.



# వినేశ్ ఫొగట్ వివాదం మళ్లీ హాట్‌టాపిక్

**అయోధ్య, మే 11 :** భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు సంబంధించిన వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనేందుకు ఆమె అయోధ్యకు చేరుకున్నప్పటికీ, భారత రెజ్లింగ్ సమాఖ్య నుంచి అనుమతి లభించలేదు. రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత మళ్లీ పోటీల్లో పాల్గొనాలంటే కనీసం ఆరు నెలల విరామం ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ నియమం ప్రకారం వినేశ్ ప్రస్తుతం అర్హురాలు కాదని భారత రెజ్లింగ్ సమాఖ్య స్పష్టం చేసింది. జూన్ 26 వరకు దేశీయ టోర్నీల్లో ఆమె పాల్గొనలేరని గతంలోనే షోకాజ్ నోటీసు కూడా జారీ చేసింది. అయితే తాను తిరిగి పోటీల్లో పాల్గొనేందుకు అర్హురాలినేనని వినేశ్ ఫొగట్ పేర్కొంది. ప్రపంచ యాంటీ డోపింగ్ సంస్థ నిబంధనల ప్రకారం యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్‌కు ముందుగానే తన రీఎంట్రీ విషయాన్ని తెలియజేశానని ఆమె వెల్లడించింది. గత జూన్‌లోనే ఈ సమాచారం అందించినట్లు తెలిపింది. రిటైర్మెంట్ తర్వాత తిరిగి బరిలోకి దిగాలనుకునే క్రీడాకారులు కనీసం ఆరు నెలల ముందే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే వినేశ్ ఇచ్చిన వివరణతో రెజ్లింగ్ సమాఖ్య సంతృప్తి చెందలేదు. అర్హత అంశంపై మాత్రమే ఆమె స్పందించిందని, క్రమశిక్షణా చర్యలపై సరైన వివరణ ఇవ్వలేదని సమాఖ్య పేర్కొంది. జాతీయ టోర్నీలో పాల్గొనే మహిళా రెజ్లర్లకు సోమవారం సాయంత్రం వెయిట్ చెకింగ్ నిర్వహించనున్నారు. మంగళవారం పోటీలు జరగనున్నాయి. ఈ టోర్నీలో విజేతలుగా నిలిచిన వారికి ప్రపంచ చాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం లభించనుంది.

# పరుగుల సునామీలో ఢిల్లీదే గెలుపు!





**అక్షర్, మిల్లర్ మెరుపులు.. పంజాబ్‌పై 3 వికెట్ల తేడాతో విజయం**

**ఒకే ఓవర్ మిగిలి ఉండగానే 211 పరుగుల భారీ లక్ష్య ఛేదన**

**శ్రేయస్ అయ్యర్, ప్రియాంశ్ ఆర్యల అర్ధశతకాలు వృథా**

**ధర్మశాల :** ఐ పీ ఎల్ లో భాగంగా సోమవారం ధర్మశాలలోని హెచ్ పీ సీ ఏ (హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్) స్టేడియం వేదికగా జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్ లో పంజాబ్ కింగ్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ (డీ సీ) అద్భుత విజయం సాధించింది. పంజాబ్ నిర్దేశించిన 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఢిల్లీ బ్యాటర్లు సమష్టిగా పోరాడి మరో 6 బంతులు (ఒక ఓవర్) మిగిలి ఉండగానే 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు సాధించి ఘనవిజయాన్ని అందుకున్నారు. ఆల్ రౌండర్ అక్షర్ పటేల్, డేవిడ్ మిల్లర్ ల విధ్వంసక అర్ధశతకాలతో పాటు చివర్లో అశుతోష్ శర్మ మెరుపులు ఢిల్లీకి అద్భుత గెలుపును అందించాయి. ఈ పరాజయంతో తొలుత బ్యాటింగ్ లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్ కు తీవ్ర నిరాశే మిగిలింది. ముఖ్యంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, యువ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యల అద్భుత ఇన్నింగ్స్ లు వృథా అయ్యాయి.

## శ్రేయస్, ప్రియాంశ్ జోరు.. పంజాబ్ భారీ స్కోరు..

టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య క్రీజులో ఉన్నంతసేపు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 33 బంతుల్లోనే 56 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. వీలుచిక్కినప్పుడల్లా భారీ షాట్లు ఆడుతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అయ్యర్ 36 బంతుల్లోనే అజేయంగా 59 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. వీరికి తోడుగా కూపర్ కొన్నోలీ 27 బంతుల్లో 38 పరుగులు సాధించి అద్భుత సహకారం అందించాడు. దీంతో పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మాధవ్ తివారీ 40 పరుగులిచ్చి 2 వికెట్లు, మిచెల్ స్టార్క్ 57 పరుగులిచ్చి 2 వికెట్లు, ముకేష్ కుమార్ 31 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు. స్టార్క్ భారీగా పరుగులు సమర్పించుకోవడం ఢిల్లీకి ప్రతికూలంగా మారింది.

## అక్షర్, మిల్లర్ విధ్వంసం.. లక్ష్య ఛేదన..

211 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు ఆరంభంలోనే పంజాబ్ బౌలర్లు సవాలు విసిరారు. పంజాబ్ పేసర్ అర్ష్ దీప్ సింగ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి 21 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, యశ్ ఠాకూర్ 55 పరుగులిచ్చి 2 వికెట్లు, మార్కస్ స్టోయినిస్ 44 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టారు. వికెట్లు పడుతున్నా ఢిల్లీ బ్యాటర్లు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ముఖ్యంగా ఆల్ రౌండర్ అక్షర్ పటేల్, డేవిడ్ మిల్లర్ లు క్రీజులో కుదురుకుని పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. మైదానం నలుమూలలా సిక్సర్లు, ఫోర్లు బాదుతూ లక్ష్యాన్ని కరిగించారు. అక్షర్ పటేల్ 30 బంతుల్లోనే 56 పరుగులు సాధించగా, డేవిడ్ మిల్లర్ కేవలం 28 బంతుల్లోనే 51 పరుగులు చేసి మ్యాచ్ ను ఢిల్లీ వైపు తిప్పారు. వీరిద్దరూ అవుటైన తర్వాత మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారినప్పటికీ.. చివర్లో క్రీజులోకి వచ్చిన అశుతోష్ శర్మ కేవలం 10 బంతుల్లోనే 24 పరుగులు బాది పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు సాధించి, మరో 6 బంతులు మిగిలి ఉండగానే 3 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.






# వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానం

**దుబాయ్, మే 11 :** అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసిన తాజా వన్డే వార్షిక ర్యాంకింగ్స్‌లో భారత జట్టు మరోసారి అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 118 రేటింగ్ పాయింట్లతో టీమిండియా మొదటి స్థానంలో కొనసాగుతూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఇప్పటికే టీ20 ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానంలో ఉన్న భారత్, వన్డే ఫార్మాట్‌లోనూ తన జోరు కొనసాగిస్తోంది. టీ20 ప్రపంచకప్ 2026లో విజయం సాధించిన అనంతరం భారత జట్టు పొట్టి ఫార్మాట్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో ఘన విజయం సాధించడం ద్వారా వన్డేల్లోనూ తన బలాన్ని నిరూపించింది. తాజా ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. భారత్‌తో కేవలం ఐదు పాయింట్ల తేడా మాత్రమే ఉండటం విశేషం. 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇటీవల అద్భుత ప్రదర్శనలతో వరుస విజయాలు నమోదు చేసిన దక్షిణాఫ్రికా 102 పాయింట్లతో నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టింది. పాకిస్థాన్ ప్రస్తుతం 98 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీలంక 96 పాయింట్లతో ఆరో స్థానంలో, అఫ్గానిస్థాన్ 93 పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతున్నాయి. ఇంగ్లండ్ 89, బంగ్లాదేశ్ 84, వెస్టిండీస్ 74 పాయింట్లతో టాప్-10లో తమ స్థానాలను నిలబెట్టుకున్నాయి. ఇక ఐర్లాండ్ 54 పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానానికి పడిపోయింది. అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకగా, స్కాట్లాండ్ 44 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచింది. ఐసీసీ నిబంధనల ప్రకారం 2027 మార్చి 31 నాటికి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచే జట్లు నేరుగా వన్డే ప్రపంచకప్ 2027కు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఇప్పటికే టోర్నీకి అర్హత పొందాయి. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా టాప్-8లో కొనసాగితే, తొమ్మిదో స్థానంలో నిలిచే జట్టుకూ ప్రత్యక్ష అర్హత లభించే అవకాశం ఉండటంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.






# విజయ్ క్రేజ్ చూసి షాక్ అయ్యాను..

## ప్రియాంక చోప్రా పాత వ్యాఖ్యలు వైరల్!

**చెన్నై:** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తరుణంలో, ఆయన సినీ ప్రస్థానానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నటి ప్రియాంక చోప్రా సినీ ప్రయాణం విజయ్ సరసన ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తొలి సినిమా హీరో గురించి ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. 2002లో విడుదలైన 'తమిళన్' సినిమాతో ప్రియాంక చోప్రా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. అప్పటి తన అనుభవాలను గుర్తు చేసుకుంటూ.. "నాకు అప్పట్లో తమిళం అస్సలు తెలియదు, డైలాగులను కాగితంపై రాసుకుని బట్టీ పట్టేదాన్ని. షూటింగ్ సెట్ అంటే ఎలా ఉంటుందో కూడా తెలియని తరుణంలో విజయ్ నాకు ఎంతో సహకరించారు. అయితే షూటింగ్ సమయంలో ఆయనకున్న అభిమాన గణాన్ని చూసి నేను పూర్తిగా షాక్ అయ్యాను. వందలాది మంది ఫ్యాన్స్ సెట్స్ దగ్గరకు వచ్చి ఆయన్ను చూసే విధానం, ఆరాధించే తీరు చూస్తే.. ప్రజలు ఆయన్ను ఒక దేవుడిలా చూస్తున్నారని నాకు అనిపించింది" అని ప్రియాంక పేర్కొన్నారు. ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రా కూడా గతంలో విజయ్ వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. "విజయ్ తన కూతురిని ఎంతో గౌరవంగా చూసుకునేవారని, స్టార్ హీరో అనే గర్వం లేకుండా కొత్త హీరోయిన్‌కు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చారని" ఆమె తెలిపారు. మొదట్లో విజయ్‌తో సమానంగా డ్యాన్స్ చేయడం ప్రియాంకకు సవాలుగా అనిపించినా, ఆయన సహకారంతోనే అది సాధ్యమైందని చెప్పారు. 'తమిళన్' సినిమా ఇచ్చిన స్ఫూర్తే ప్రియాంకను నటనను ఒక కెరీర్‌గా ఎంచుకునేలా చేసిందని ఆమె వెల్లడించారు. నాడు ఒక సామాన్య నటిగా విజయ్ మేనరిజమ్స్ చూసి ఆశ్చర్యపోయిన ప్రియాంక, నేడు ఆయన ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎదగడంపై సినీ ప్రముఖులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాటి ఆమె మాటలు ఇప్పుడు విజయ్ రాజకీయ ఎదుగుదలకు సరిగ్గా సరిపోతాయని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.



# విశ్వంభరపై భారీ అంచనాలు

## రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు


మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా మొత్తం విజువల్ ఫాంటసీ ప్రపంచం నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీఎఫ్ఎక్స్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఫ్రేమ్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం 'హను-మాన్' ఫేమ్ గౌర హరిని కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. మొత్తానికి 'విశ్వంభర' సాధారణ ఫాంటసీ చిత్రం కాకుండా, తెలుగు ప్రేక్షకులకు భారీ విజువల్ విందుగా నిలవబోతుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.





# నేను బీజేపీకి సపోర్ట్ చేస్తా.. రేపిస్టులకు కాదు..

## యాంకర్ రష్మీ గౌతమ్ సంచలన పోస్ట్




కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ సాయిపై పోక్సో కేసు వ్యవహారంపై యాంకర్ రష్మీ గౌతమి సంచలన పోస్టు చేశారు. తాను బీజేపీకి మద్దతిస్తానని.. అయితే లైంగిక వేధింపులకు పాల్పడేవారికి కాదని రష్మి స్పష్టం చేశారు. యాంకర్ రష్మీ గురించి స్పెషల్ ఇంట్రడక్షన్ అవసరం లేదు. సోషల్ మీడియాలో ఎప్పుడూ బీజేపీకి అనుకూలంగా పోస్టులు పెడుతుంటారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు విషయంలో పలువురు ఆమెను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రష్మి ఎక్స్ వేదికగా స్పందించారు. "నేను బీజేపీకి మద్దతు ఇస్తాను కానీ.. రేపిస్టులకు, లైంగిక వేధింపులకు పాల్పడేవారికి కాదని" ఆమె పేర్కొన్నారు. తాను సమస్యలపై కేవలం సానుభూతి చూపగలనని, పోరాడేంత శక్తి తనకు లేదన్నారు.

# ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైనదే

## నటి త్రిష ఆసక్తికర పోస్ట్

ఫిల్మ్ స్టార్ త్రిష తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష సోమవారం తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెహ్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాప్షన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com